నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్, అత్వెల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలలో, మండలంలోని పలు గ్రామాలలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈలు రాంబాబు, మౌలాలి తెలిపారు. అత్వెల్లి రూరల్, గౌడవెల్లి బండమాదారం, రాయిలాపూర్, డబీల్‌పూర్, కండ్లకోయ, సోమారం సుతారిగూడ, రైల్వే ట్రాక్ రోడ్, సర్వీస్‌రోడ్‌పూడూర్, కిష్టాపూర్‌లలోని పరిశ్రమలకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు.

పోచారం: సింగపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నోజిగూడ, ఎల్ఎన్ కాలనీ, ఎల్ఐజీ, జైపురి కాలనీ, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్, సాయంత్రం 4 నుంచి 4:30 గంటల వరకు రాజీవ్ గృహకల్ప, ఆర్ఎస్ఆర్ హైట్స్, మయూరి డెవలపర్స్, సాయినగర్, మోడీ ఎమరాల్డ్ హైట్స్, సూర్యానగర్, మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల వరకు కొర్రెముల్‌లోని అన్నీ కాలనీలు, చౌదరిగూడ, వెంకటాపూర్, మక్త, తేనుగూడెం, టూబీహెచ్‌కే, బాలాజీనగర్, సదత్‌అలీగూడ, సుప్రభాత్ టౌన్‌షిప్, ఓయూ కాలనీ, కొర్రెముల క్రాస్ రోడ్ ప్రాంతాలకు కరెంట్ ఉండదన్నారు.

జీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



జీపీఎల్ కప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల క్రీడా మైదానంలో శుక్రవారం ఘట్‌కేసర్ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై (జీపీఎల్) కప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాసుగుప్తా, కమలాకర్‌రెడ్డి, మురళీగౌడ్ పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత



పోచారం: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, జలమండలి సిబ్బందికి, ఎలక్ట్రీషియన్లకు 13వ వార్డు కౌన్సిలర్ సామల శ్రీలతా బుచ్చిరెడ్డి నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నా అన్నారు. దుస్తులతో పాటు నగదు బహుమతులను కార్మికులకు అందజేసి శాలువాలతో సత్కరించారు.

మార్కెట్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవిన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుచరిత మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం. 614లో ప్రభుత్వం నిర్మిస్తున్న వెజ్‌నాన్ వెజ్ స్థలంలో పిల్లర్లు వేసి నిర్మాణాన్ని ఆపివేయడంతో కొందరు కబ్జాదారులు రోడ్డుకు అడ్డంగా రేకులు నిర్మించి రాత్రికి రాత్రే గదులను కట్టే ప్రయత్నం చేయడంతో.. సమాచారం అందుకున్న అధికారులు వాటిని కూల్చివేశారు. మిగిలిన అక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో వీలైనంత త్వరగా తొలగిస్తామని, మరోమారు అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కూల్చివేతల్లో ఆర్ఐ వీరేంద్రసాయి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టని పట్టణ ప్రగతి



- ముగియనున్న పురపాలక సంఘాల పాలకవర్గం గడువు
- ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రూ. లక్షల్లో పన్నులు వసూలు.. ముందుకు సాగని అభివృద్ధి పనులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీల పాలక వర్గం గడువు ఈ నెల 26తో ముగియనుంది. ఈ ఐదేళ్ల కాలంలో సంబంధిత పురపాలక సంఘాల పాలకవర్గం హయాంలో జరిగిన అభివృద్ధి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి వెళ్లిన తీరు కనబడుతోంది. నగర శివారు పట్టణాల్లో పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధను పురపాలికలు అభివృద్ధిపై చూపకపోవటంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొన్ని పురపాలికల్లో చిన్న పాటి వర్షం పడితే.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి.

◆ శివారుల్లోని గ్రామ, నగర పంచాయతీల విలీనంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలుగా అవతరించినా.. ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం వర్ణనాతీతంగా దర్శనమిస్తున్నాయి. శివారు పట్టణాలను హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి పరచటానికి ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా.. ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

సమీకృత మార్కెట్లు అంతే..

జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని కేటాయించిన అధికార యంత్రాంగం.. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణానికి రూ.4.5 కోట్ల చొప్పున, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున అప్పటి సర్కారు నిధులు మంజూరు చేసింది. అయితే ఈ నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నర ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

పట్టణాల్లో అభివృద్ధి ఇలా..

శివారుల్లోని అతిపెద్ద నగర పాలక సంస్థ బోడుప్పల్‌లో 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వచ్చినా.. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో 230.2 కిలోమీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 35 కిలోమీటర్లు, వర్షపు వరద నీరు డ్రైనేజీలు ఏడు కిలోమీటర్లు వరకు ఉన్నాయి. 346.30 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 36.5 కిలోమీటర్ల వరకు ఉన్నాయి.

◆ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా రూ.30 కోట్ల ఆదాయం సమకూరినప్పటికీ ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. 215 కిలోమీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 32 కిలోమీటర్లు, 240 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. మట్టి రోడ్లు కూడా 9 కిలోమీటర్ల వరకు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ఎడతేరపిలేకుండా వర్షాలు కురిస్తే ప్రజలు నానా అగచాట్లు పడాల్సివస్తోంది. మిగతా 2 నగరపాలక సంస్థలు, 9 మున్సిపాలిటీల్లో కూడా ప్రజలు అవే సమస్యలతో బాధపడుతున్నారు.

కోట్లల్లో పన్నులు.. ఇతర వనరులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కొక్క పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నింటిని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవటం లేదు.

సమస్యలివే..

పురపాలక సంఘాల్లో చెత్తా, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అన్న రీతీలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకపోయిన చెత్తాతో దోమల బాధను భరించలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కొవలసి వస్తోంది. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, వరద నీటికి ఆ పరిసరప్రాంతాలు దోమలకు కేంద్రంగా మారుతున్నాయి.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

మేడ్చల్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రూ.6.48 కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే మూడు పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని, మరో మూడు పథకాలైన రైతు భరోసా, కొత్తరేషన్ కార్డు జారీ, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాలు జనవరి 26న అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో లేని విధంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రూ. 5 వేల కోట్లకు పైగా నిధులు మున్సిపాలిటీలకు కేటాయించామన్నారు. మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలకై గ్రామ సభలు పెట్టి ప్రజల వద్ద పథకాలు చేరవేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మార్చి తర్వాత అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పార్టీలకతీతంగా జరుగుతుందని, కొందరు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్, టీజీపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, హేమంత్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు



3వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



2వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ. కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి శుక్రవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, వసంత, శశికళ, హేమలత, నర్సింగ్‌రావు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హై స్కూల్ వార్షికోత్సవం



విజ్ఞాన్ ప్రభోదానంద విద్యార్థుల నృత్య ప్రదర్శన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథి పూర్ణ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ కొండాపూర్ విజ్ఞాన్ ప్రభోదానంద హై స్కూల్, ఈసీఐఎల్ విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో కొండాపూర్‌లో 24వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇండియన్ మౌంటేన్ మాలావత్ పూర్ణ హాజరయ్యారు. ఈ వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే ప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ ప్రభోదానంద ప్రశాంతి నికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ మౌని స్టాలిన్, భవాని, విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు



పోచారం: బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో పాటు మరి కొందరిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో సర్వే నెంబర్లు 739, 740, 741, 742లోని తన భూమి మీదకు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కొంత మందితో కలిసి గురువారం అక్రమంగా ప్రవేశించి సమావేశం నిర్వహించారని పట్టాదారు అలూరి వెంకటేష్ ఫిర్యాదు చేశారు. 2005వ సంవత్సరంలో పై సర్వే నెంబర్లలోని 47 ఎకరాల 25 గుంటల భూమిని పట్టాదారులు చెరుకు దశరథ కుటుంబ సభ్యులు, మునుకుంట్ల లచ్చయ్య గౌడ్ నుంచి చట్టపరంగా కొనుగోలు చేశారని, ఈ భూమిని కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డితో పాటు జుబేర్ అక్రమ్, ఉమర్ అక్రమ్, అమీర్ సోహెల్, శివారెడ్డి, సామిరెడ్డి, శ్రీనివాస్, బస్వరాజు గౌడ్, మన్యం, బాలు, సురేష్ నాయక్, ఐలయ్య, నీలి శ్రీనివాస్, మరి కొందరిపై కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రులు లింగ వివక్ష చూపొద్దు



బాలికల దినోత్సవం ర్యాలీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య, జిల్లా అధికారిని హేమలత

ఘట్‌కేసర్: తల్లిదండ్రులు బాలికల రక్షణ, విద్యా, ఆరోగ్యంపై లింగ వివక్ష చూపరాదని, బాలురితో పాటు బాలికలను సమానంగా చూడాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సం వేడుకలకు బాలికల జిల్లా సంరక్షణ అధికారి హేమలతతో కలిసి ముఖ్యతిథులుగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలికలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. వ్యాస రచన, వకృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలక బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సం

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం జాతీయ డ్రైవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లి పాఠశాల విద్యార్థులు డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎం సుధాకర్, డిపో అధికారులు లక్ష్మణ్, పీఎస్ఎన్‌రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

మున్సిపాలిటీలో చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత ఆధ్వర్యంలో డ్రైవర్ల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురి డ్రైవర్లను శాలువాతో సత్కరించారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థునులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో చెంగిచెర్ల డిపో అసిస్టెంట్ మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.





ఘట్‌కేసర్‌లో.. ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న ఎస్సై నరసింహ

ఒంటరిగా ఉన్న బాలుడిని పోలీసులకు అప్పగింత



అయాన్

జవహర్‌నగర్: ఒంటరిగా ఉన్న ఓ బాలుడిని గుర్తించిన స్థానికులు జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్‌లోని అయేషా మసీద్ వద్ద మహ్మద్ ఆయాన్ శుక్రవారం ఉదయం ఏడుస్తూ స్థానికులకు కనిపించాడు. దీంతో వెంటనే స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో బాలుడిని అప్పగించారు. బాలుడి కోసం తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

భూమి లేని కూలీలకు ఇళ్లు కేటాయించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న అంకుషాపూర్ వ్యవసాయ కూలీలు

ఘట్‌కేసర్: భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలని అంకుషాపూర్‌కు చెందిన భూమి లేని వ్యవసాయ కూలీలు ఎంపీడీఓ గీతారెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. 2023–24 సంవత్సరంలో 100 రోజులు పని చేసి ఉండాలని షరతు పెట్టడం సమంజసం కాదని లేఖలో తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి కూలీకి ఏడాదికి రూ. 12 వేలు, ఇంటిని కేటాయించాలని కోరారు. అంకుషాపూర్ భూమి లేని వ్యవసాయ కూలీలు, సుశీల, కవిత, నర్సమ్మ, చంద్రకళ, పుణ్యవతి, శ్యామల పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

పోచారం: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – గ్రామ సభలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 21న మాదారం నుంచి ప్రారంభమైన గ్రామ సభలు కాచవానిసింగారంతో పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం చౌదరిగూడ, మధ్యాహ్నం కాచవానిసింగారంలో గ్రామ సభలు నిర్వహించారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా రేషన్ కార్డులు మంజూరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, ఇతర సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పరామర్శ

పోచారం: రాజీవ్ గృహకల్ప కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తున్న ధనలక్ష్మి వంట చేస్తుండగా కాలుజారిపడడంతో తీవ్రంగా గాయమైంది. బాధితురాలిని సీపీఎం మండల కార్యదర్శి సబిత శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ధనలక్ష్మిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సబిత

అర్హులకే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు



వార్డు సభలో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న రేషన్ కార్డుల జారీ, అందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అర్హులనే లబ్ధిదారులుగా చేర్చాలని అధికారులకు చైర్మన్ చంద్రారెడ్డి సూచించారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన మాట్లాడుతూ.. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్ కుమార్, సీఐ వెంకటయ్య, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు అన్నంరాజు సుమిత్రా సురేష్, సుర్వి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల సంబరాలు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ చౌరస్తా వద్ద శ్రీరామ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్ గుర్తింపు కార్మిక యూనియన్ ఎన్నికలలో సీఐటీయు విజయం సాధించింది. కార్మిక సంఘం అధ్యక్షుడిగా జిల్లా సీఐటీయు అధ్యక్షుడు ఎర్ర అశోక్ విజయం సాధించాడు. ఈ నేపథ్యంలో కార్మికులు, సీఐటీయు నాయకులు డబీల్‌పూర్ చౌరస్తా వద్ద, కంపెనీ వద్ద, మేడ్చల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. సంబరాల్లో నాయకులు నరేష్, నర్సింగ్‌రావు, పద్మావతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో సీఐటీయు నాయకులు, కార్మికులు

‘లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు’ విజయవంతం చేయండి



జవహర్‌నగర్‌లో.. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ,



అంకుషాపూర్‌లో.. దప్పులతో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు

జవహర్‌నగర్: ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే ‘లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి, కాప్రా మండల ఇన్‌చార్జి శివకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జవహర్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న ఘట్‌కేసర్ అన్నోజిగూడలో నిర్వహించే సమావేశానికి భారీ సంఖ్యలో తరలివెళ్లాలన్నారు. నాయకులు కొమ్ము ఆనంద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్త నరేష్, మహేందర్, విష్ణు, వేణు, డాక్టర్ శ్రీనివాస్, ప్రకాష్, యాదయ్య, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేష్ పాల్గొన్నారు.